సాక్షి
కర్నూలు
శుక్రవారం । 26 । జూలై । 2024



రావి ఆకుపై 'కార్గిల్' చిత్రం

ఆదోని అర్బన్: కార్గిల్ విజయ్‌దివాస్ సందర్భంగా అలసందగుత్తి జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని తలారి నిఖిత రావి ఆకుపై దేశ సైనికులు, త్రివర్ణ పతాకాన్ని అద్భుతంగా రూపొందించారు.



ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొని ఇద్దరు మృతి

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. దుర్ఘటనతో నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,632.20
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 102.576
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 81,030
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 86,674

న్యూస్‌రీల్

ఆర్డీఎస్ వద్దకు వరద నీరు



కోసిగి: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేసిన వరద నీరు గురువారం సాయంత్రం కోసిగి మండలం కందుకూరు గ్రామ సమీపంలోని రాజోలి బండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) ఆనకట్ట వద్దకు చేరాయి. దీంతో రెవెన్యూ అధికారులు నదీ తీర గ్రామాలైన కడదొడ్డి, కందుకూరు, లక్ష్మీనగర్ క్యాంప్, అగసనూరు, సాతనూరు, తుంబిగనూరు గ్రామాల్లో పర్యటించి ప్రజలను, రైతులను అప్రమత్తం చేశారు. పొలాల్లో మోటార్ల, విలువ వస్తువులు ఉంటే భద్ర పరచుకోవాలని సూచించారు. నది వైపు ఎవరూ వెళ్లరాదని, వీఆర్వోలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

11,311 సీసీఆర్ కార్డుల జారీ

- ఇప్పటి వరకు ఒక్క సాగుదారుకూ దక్కని రుణం

కర్నూలు(అగ్రికల్చర్): సాగుదారులకు సీసీఆర్ కార్డుల జారీలో పురోగతి కరువైంది. జిల్లాలో 472 గ్రామాలు ఉండగా 2024–25 సంవత్సరానికి 32,255 సీసీఆర్ కార్డులు జారీ చేయాలనేది లక్ష్యం. అయితే ఇప్పటి వరకు 11,311 సీసీఆర్ కార్డులు మాత్రమే జారీ అయినట్లు తెలుస్తోంది. వారానికి ఒకసారి సీసీఆర్ కార్డులు పొందిన రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు బ్యాంకులకు పంపుతారు. ఇప్పటి వరకు బ్యాంకులు సీసీఆర్‌సీ కార్డు కలిగిన ఒక్క కౌలుదారుకు కూడా రుణం ఇచ్చిన దాఖలాలు లేవు. కోడుమూరు, సీ.బెళగల్, కల్లూరు, కర్నూలు రూరల్, ఆస్పరి, క్రిష్ణగిరి, ఆలూరు, చిప్పగిరి, దేవనకొండ మండలాల్లో సీసీఆర్ కార్డుల జారీ అంతంతమాత్రంగానే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023–24లో రికార్డు స్థాయిలో దాదాపు 30వేలకు పైగా సీసీఆర్ కార్డులు జారీ చేశారు. ఈ సారి లక్ష్యంలో 35.07 శాతం మాత్రమే జారీ చేయడం గమనార్హం.

పంటల సాగు 42.99 శాతం

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 42.99 శాతం పంటలు సాగయ్యాయి. సాధారణ సాగు 4.19 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 1,80,206 హెక్టార్లలో పంటలు వేశారు. సీజన్ మొదలై దాదాపు రెండు నెలలు అవుతున్నా 50 శాతం కూడ పంటలు కూడా సాగు కాకపోవడం గమనార్హం. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మిమీ ఉండగా ఇప్పటి వరకు 56.4 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. లోటు వర్షపాతం 38 శాతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటంతో పత్తి సాగు మాత్రం పెరుగుతోంది. ఒక్క పత్తి మాత్రమే 1,07,114 హెక్టార్లలో సాగవుతోంది. ఇక వేరుశనగ 30,986 హెక్టార్లలో, కంది 17,137.. ఆముదం 5,984.. మిరప 1,715.. ఉల్లి 5,213.. సజ్జ 3,488.. మొక్కజొన్న 2,997.. కొర్ర 2,359, టమాట 1,080 హెక్టార్ల ప్రకారం పంటలు సాగయ్యాయి.

31న స్పాట్ కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీలో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 31వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమొబైల్, మెకానికల్ బ్రాంచీల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, 10వ తరగతి పాసై ఇతర కాలేజీల్లో అడ్మిషన్ తీసుకోని వారు హాజరుకావొచ్చనని పేర్కొన్నారు. బి.తాండ్రపాడులోని ప్రభుత్వ మైనార్టీ కాలేజీలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు 8919638961, 8897544821 సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధుల పంజా

- పలు ప్రాంతాల్లో అతిసారం కేసులు
- విజృంభిస్తున్న డెంగీ
- పట్టణాలు, గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం
- కలుషితమవుతున్న తాగునీరు, ఆహారం
- పీహెచ్‌సీల్లో నామమాత్రంగా వైద్య సేవలు
- స్పెషాలిటీ వైద్యులను తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం

➤ జూన్ 16, 17 తేదీల్లో హొళగుంద మండలంలోని నెరణికి తండాలో తాగునీరు కలుషితమై అతిసారం ప్రబలి దాదాపు 50 మంది అస్వస్థతకు గురవగా, చంద్రికాబాయి అనే వృద్ధురాలు మృతి చెందింది.

➤ ఈనెల 12న మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో కలుషితనీరు తాగి 50 మంది అస్వస్థతకు గురయ్యారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ నెల 14న అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక జ్యోతి వాంతులు, విరేచనాలతో మృతి చెందింది.

➤ ఈనెల 20న ఓర్వకల్లు మండలంకన్నమడకల గ్రామానికి చెందిన సాగర్(7) అనే బాలుడు వాంతులు, విరేచనాలతో మృతి చెందాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి ఈనెల 18వ తేదీన అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతి చెందాడు.

..జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట అతిసారం విజృంభిస్తోంది. డెంగీ, మలేరియా జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం 'స్టాప్ డయేరియా' అంటూ ప్రచారం చేయడం తప్ప క్షేత్రస్థాయితో చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. ఫలితంగా ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోనిలోని ఎంసీహెచ్, ఏరియా ఆసుపత్రి, ఎమ్మిగనూరులో వంద పడకల ఆసుపత్రి, ఐదు సీహెచ్‌సీలు, 35 పీహెచ్‌సీలు, 26 యుపీహెచ్‌సీలు ఉన్నాయి. వీటితో పాటు పెంచికలపాడులో విశ్వభారతి జనరల్ హాస్పిటల్ ఉంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ మెడిసిన్ విభాగానికి ప్రతిరోజూ 300ల దాకా రోగులు వస్తుండగా అందులో 20 శాతం వరకు వివిధ రకాల జ్వరాలతో బాధపడుతూ వస్తున్నారు. దాని పక్కనే ఉన్న ఐడీ విభాగానికి రోజులో 5 నుంచి 10 మంది డయేరియా లక్షణాలతో చికిత్స కోసం వస్తున్నారు. ప్రస్తుతం అంటువ్యాధుల విభాగంలో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. చిన్నపిల్లల విభాగానికి ప్రతిరోజూ 15 నుంచి 20 మంది దాకా చిన్నారులు అతిసారతో చికిత్స కోసం వస్తున్నారు. నిత్యం 4 నుంచి 6 మంది దాకా పిల్లలు అతిసారతో, 10 మంది దాకా వివిధ రకాల జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. జిల్లాలో గత జనవరి నుంచి ఇప్పటి వరకు 200 దాకా డెంగీ కేసులు, నాలుగు మలేరియా కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవంగా వందలాది మంది డెంగీ, మలేరియా లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో టైఫాయిడ్ బాధితులు వైద్యుల వద్ద చికిత్స తీసుకుంటున్నారు.

పీహెచ్‌సీల్లో నామమాత్రపు డ్యూటీలు

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, మరో 12 పీహెచ్‌సీలు కొత్తగా మంజూరయ్యాయి. 26 యుపీహెచ్‌సీలు(పట్టణ ఆరోగ్య కేంద్రాలు) ఉన్నాయి. వీటిలో పనిచేసే వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరు విధానం ఉండేది. ఇది ఇప్పుడు నామమాత్రంగా మారింది. దాని గురించి అడిగేవారు, పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో వైద్యులు, సిబ్బంది మళ్లీ పాత విధానంలోనే ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధితో ఒక బాలిక మృతి చెందడంతో పాటు 50 మందికి పైగా ఆసుపత్రి పాలైనా జిల్లా అధికారులకు కనీస సమాచారం లేదు. రాష్ట్ర ఉన్నతాధికారులు చెప్పేంత వరకు జిల్లా అధికారులకు ఈ విషయమై ఎలాంటి సమాచారాన్ని స్థానిక వైద్యాధికారులు ఇవ్వలేదంటే పరిస్థితి ఏమిటో అర్థం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ ఉంది. ఈ మేరకు ఎంఎల్‌హెచ్‌పీ(సీహెచ్‌వో) అక్కడే ఉండి విధులు నిర్వహిస్తున్నారు. ముందుగా అక్కడ పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్‌ఎం, ఆశాలకు అతిసారం విషయం తెలిసి ఉండాలి. వారికి తెలియలేదంటే వారు విధులకు సరిగ్గా వెళ్లకపోయి ఉండాలి. లేదా వారి వద్దకు ప్రజలు చికిత్స కోసం వెళ్లకపోవడం అయినా అయి ఉండాలి. ఈ విషయం మంత్రాలయం పీహెచ్‌సీ వైద్యాధికారికి కూడా తెలియకుండా మేనేజ్ చేశారన్న విమర్శలు ఉన్నాయి. దీనిని బట్టి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది పనితీరు ఎలాగుందో అర్థం అవుతుంది. మరోవైపు జిల్లా అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు సైతం కర్నూలు నగరానికి 30 కి.మీ పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలు మాత్రమే పరిశీలించి వస్తున్నారు. ఈ కారణంగా జిల్లా సరిహద్దులోని తమ ఆరోగ్య కేంద్రాలకు ఎవ్వరూ రారనే ధీమా అక్కడి వైద్యాధికారులకు, వైద్యసిబ్బందికి ఉండటంతో విధి నిర్వహణలో వారు నిర్లక్ష్యంగా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

వ్యాధులను కప్పి పుచ్చుతున్న అధికారులు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు జ్వరం, అతిసార లక్షణాలతో చికిత్స కోసం వెళ్తున్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు వైద్యుల వద్దకు కూడా అంతే సంఖ్యలో చికిత్స కోసం వెళ్తున్నారు. ఇలా చికిత్స కోసం వెళ్లిన వారిలో అధిక శాతం టైఫాయిడ్, మలేరియా, డెంగీ కేసులు ఉంటున్నాయి. కానీ జిల్లా వ్యాప్తంగా రెండు నెలల్లో కేవలం 20 డెంగీ కేసులు నమోదు కాగా, ఒక్కటి కూడా మలేరియా కేసులు నమోదు కాలేదని మలేరియా విభాగం ప్రభుత్వానికి లెక్కలు పంపించింది. మరోవైపు కర్నూలు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో పదుల సంఖ్యలో ఇప్పటికీ డెంగీ కేసులకు చికిత్స చేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ పదికిపైగా మలేరియా లక్షణాలతో రోగులు చికిత్స పొందుతున్నారు. కానీ ఇవన్నీ డెంగీ, మలేరియా కేసులు కాదని అధికారులు సర్దిచెప్పుకుంటున్నారు. కేసులు అధిక సంఖ్యలో బయటపడితే తమ ఉద్యోగాలకు ఎక్కడ ఎసరు వస్తుందోనని వారు ఆందోళన చెంది కేసులు బయటపెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



ఒకే బెడ్డుపై ఇద్దరిని ఉంచి చికిత్స అందిస్తున్న దృశ్యం

ప్రైవేటులో ఖర్చు బారెడు

సాధారణ జ్వరంతో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళితే వివిధ రక్తపరీక్షలంటూ రూ.3వేలకు పైగా బిల్లు వేసే డాక్టర్లున్న పరిస్థితి నెలకొంది. జ్వరం ఉందని వైద్యుల వద్దకు వెళితే చాలు లక్షణాలతో సంబంధం లేకుండా టైఫాయిడ్, మలేరియా, డెంగీ మూడు జ్వరాల నిర్ధారణకు ఏకకాలంలో వైద్యులు పరీక్షలు చేస్తున్నారు. ఇవేవీ నిర్ధారణ కాకపోతే మళ్లీ స్కానింగ్, ఎక్స్‌రేలు తీయించి రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్, ఎన్ఆర్ పేట, కొత్తబస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని పలువురి వైద్యులు ఇలాగే రోగుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ర్యాపిడ్ టెస్ట్‌లో డెంగీ పాజిటివ్ వచ్చిందంటే చాలు ఆసుపత్రిలో చేర్చుకుని రూ.50వేల దాకా ఖర్చు చేయిస్తున్నారు. ఈ ఖర్చులు భరించలేకే చాలా మంది జ్వరం రాగానే మెడికల్‌షాపులకు మందులు కొని వాడే వారి సంఖ్య ఇటీవల కాలంలో ఎక్కువైంది. మందులకు తగ్గకపోతే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆసుపత్రిలో ప్రతిరోజూ ఓపీ రోగుల సంఖ్య ఇప్పటికీ రోజుకు 2,500ల నుంచి 3వేల దాకా చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో అధిక శాతం జ్వరాల కేసులే ఉంటున్నాయి. ఈ కారణంగా జనరల్ మెడిసిన్ విభాగాల్లో పలు పడకలపై ఇద్దరేసి రోగులు చికిత్స పొందాల్సిన పరిస్థితి నెలకొంది.

అవగాహన కల్పిస్తున్నాం



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా నీరు నిల్వ లేకుండా చేసి దోమలు పెరగకుండా చూస్తున్నాం. డెంగీ, మలేరియా ప్రబలిన కేసులున్న ప్రాంతాల్లో చుట్టుపక్కల 50 ఇళ్లల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తున్నాం. అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుతున్నాం.
–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌వో, కర్నూలు

నీటి కలుషితం అధ్యయనానికి కమిటీలు

మరో ఏడు రోజుల్లో ఎల్ఎల్‌సీ ద్వారా సాగు, తాగునీరు

- ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- కస్తూర్బాలు, గురుకులాల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి నివేదించాం
- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి సిలిండర్ల ప్రతిపాదన
- 'సాక్షి'తో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): గ్రామీణ ప్రాంతాల్లో నీటి కలుషితంపై అధ్యయనానికి నలుగురు అధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు సీజనల్ వ్యాధులైన టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, డయేరియా ప్రబలి మంత్రాలయం నియోజకవర్గంలో ఒకరు చనిపోవడం బాధాకరమన్నారు. ఈ ఘటన తరువాత సీజనల్ వ్యాధులతో మరెవ్వరూ చనిపోకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రతి గ్రామంలో తహశీల్దార్, ఎంపీడీఓ, మండల ప్రత్యేకాధికారి, ఈఓఆర్డీలతో కూడిన కమిటీలను వేశామన్నారు. ఈ కమిటీలు జిల్లాలోని 484 గ్రామాల్లో పర్యటించి నీరు ఎందుకు కలుషితం అవుతుందో అధ్యయనం చేసి నివేదిక ఇస్తారన్నారు. ఇప్పటికే 90 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన సర్వేను ఆయా బృందాలు జూలై 31లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఇప్పటికీ అక్కడక్కడ కట్టెలను వినియోగిస్తున్నారన్నారు. అందువల్ల నాణ్యతను పెంచేందుకు 400 పాఠశాలలకు గ్యాస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదించామన్నారు.
- ఎల్ఎల్‌సీ కింద జిల్లాలో 35వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఇప్పటికే ఎమ్మిగనూరు వరకు నీరు వచ్చిందని, మరో వారంలో ఎస్ఎస్ ట్యాంకులతో పాటు సాగునీటిని పొలాలకు అందిస్తామన్నారు. చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తునామన్నారు.
- ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో మౌలిక వసతులు కల్పనకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని, ఇది ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం హబ్‌కు నీటిని తరలించేందుకు రూ.66 కోట్ల నిధులు అవసరమన్నారు. రోడ్డు, విద్యుత్ సదుపాయాలు ఉన్నాయని, రైల్వే లైన్ కోసం త్వరలోనే సర్వే జరిగే అవకాశం ఉందన్నారు. దాదాపు 9,900 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వస్తే కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.
- ఓర్వకల్ విమానాశ్రయంలో రన్‌వే విస్తరణ, నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన భూమి ఉందని, నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు.
- జిల్లాలో కస్తూర్బాలు, గురుకులాల్లో సీట్ల కోసం విపరీతమైన డిమాండ్ ఉందని, ప్రజల్లో చైతన్యం వచ్చి తమ పిల్లలను చదివించుకోవడానికి ముందుకు వస్తున్నారన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న కస్తూర్బాలు, గురుకులాల్లో సీట్లు ఇచ్చినా వసతులు లేవన్నారు. దీంతో వచ్చే సంవత్సరం నుంచి కొత్తగా జిల్లాకు కొన్ని కస్తూర్బాలు, గురుకులాలను పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు.

చదువుల తల్లికి తొలగిన కష్టం

- కేజీబీవీలో చేర్పించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

గోనెగండ్ల: చిన్న మరివీడు గ్రామానికి చెందిన విద్యార్థిని బోయ సింధుకు కష్టం తొలగింది. చదువుకోవాలని ఆశ ఉన్నా అందుకు కుటుంబ పరిస్థితులు సహకరించకపోవడంతో ఈ విద్యార్థిని వారంలో నాలుగురోజులు పనికి.. మూడు రోజులు బడి వెళ్లేది. ఈ క్రమంలో 'చదువుల తల్లికి ఎంత కష్టం' అనే శీర్షిక సాక్షి దినపత్రికలో గురువారం వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశాల మేరకు ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ చిన్నమరివీడు గ్రామానికి వెళ్లి బాలిక తల్లిదండ్రులు బోయ పార్వతి, బోయ గోవింద్‌తో మాట్లాడారు. బాలిక తల్లిదండ్రుల స్థితిగతులను జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శామ్యూల్ పాల్‌కు తెలపడంతో ఆయన గోనెగండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి సింధును అందులో తొమ్మిదో తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించి విద్యార్థిని సింధును గోనెగండ్లలోని కేజీబీవీ పాఠశాలలో చేర్పించామన్నారు. ఇప్పటి నుంచి విద్యార్థిని ఇక్కడే చదువుకుంటుందని తెలిపారు.



విద్యార్థిని సింధును కేజీబీవీలో చేర్పించిన అనంతరం మాట్లాడుతున్న విద్యాశాఖ ఏడీ శామ్యూల్‌పాల్

29న ఓర్వకల్లులో రూ.150 కోట్ల రుణాల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఈ నెల 29న స్వయం సహాయక సంఘాల మహిళలు 5000 మందితో జరిగే కార్యక్రమంలో రూ.150 కోట్ల రుణాలు పంపిణీ చేయడానికి కెనరా బ్యాంకు కర్నూలు రీజినల్ కార్యాలయం ఏర్పాట్లు చేసింది. స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్లు, ఎంఎస్ఎంఈ రిటైల్ రుణాలు రూ.25 కోట్లు, వ్యవసాయ రుణాలు రూ.25 కోట్ల వరకు రుణాలు పంపిణీ చేస్తోంది. ఈ సందర్భంగా బ్యాంకు అమలు చేస్తున్న కార్యక్రమాలను కూడా వివరిస్తారు. ఈ కార్యక్రమానికి కెనరా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) ఆశోక్‌చంద్ర ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఓర్వకల్లులో కార్యక్రమం పూర్తి అయిన తర్వాత కర్నూలులో బస చేసే హోటల్‌లో బ్యాంకు వీఐపీ కస్టమర్లతో ముఖాముఖి అవుతారని కెనరా బ్యాంకు వర్గాలు తెలిపాయి.

గ్రామ సచివాలయాల్లో తెగిన 'ఆధార'ం

- నిలిచిపోయిన ఆధార్ సేవలు
- పట్టించుకోని ప్రభుత్వం
- ఇబ్బందుల్లో విద్యార్థులు, రైతులు

సి.బెళగల్: గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఆధార్ సేవలు నిలిచిపోవడంతో విద్యార్థులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల బయోమెట్రిక్ సమస్యలకు, రైతుల ఈకేవైసీ వంటి సేవలకు ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి. అదేవిధంగా చిన్నారులకు కొత్త ఆధార్ కార్డులు కావాలన్నా గ్రామాల్లోని సచివాలయాలకు వెళ్లేవారు. అయితే నేడు అవి పనిచేయక పోవడంతో పట్టణాలకు, నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. సి. బెళగల్ మండలంలోని మూడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలను 2022లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. సి.బెళగల్ గ్రామ సచివాలయం –1, పోలకల్ గ్రామ సచివాలయం– 2 , ముడుమాల గ్రామ సచివాలయంలో కొత్త ఆధార్ సేవలను పూర్తిగా ఉచితంగా అందించేవారు. బయోమెట్రిక్ అప్‌డేట్‌కు సేవా రుసుం తీసుకునే వారు కాదు. మొబైల్ నంబర్, అడ్రస్, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్ల మార్పులకు నామమాత్రం రుసుం వసూలు చేసేవారు. రైతులకు, విద్యార్థులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సేవలు ఆగిపోయాయి. దీంతో ప్రైవేట్‌గా ఏర్పాటు చేసుకున్న మీ సేవ కేంద్రాలకు డిమాండ్ పెరిగింది. సచివాలయాల్లో అధార్ సేవలు అందకపోవడంతో ప్రజలు గూడూరు, ఎమ్మిగనూరు, కర్నూలుకు వెళ్లాల్సి వస్తోంది. మీ సేవ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. సచివాలయాల్లో సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆధార్ సేవల కోసం ముడుమాల సచివాలయానికి వచ్చిన ప్రజలు

ఎమ్మిగనూరుకు పొమ్మన్నారు




నా వేలి ముద్రలు పడలేదంట. మళ్లీ ఆధార్ కోసం వేళ్లు పెట్టి ఫొటో దిగాలంటా. ఇప్పుడు బెళగల్, పోలకల్లులో కూడా ఆధార్ కార్డు దించే ఆఫీస్‌లు లేవంట. అందరూ ఎమ్మిగనూరుకు వెళ్లి చేసుకుంటున్నారు. మమ్మల్ని కూడా ఎమ్మిగనూరుకే పొమ్మన్నారు. – కురువ మోహన్, విద్యార్థి, గుండ్రేవుల గ్రామం

ప్రభుత్వం స్పందించాలి



టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. అప్పుడు (గత ప్రభుత్వంలో) ఆధార్ కేంద్రా లు సచివాలయాల్లో ఉండటంతో ప్రజలకు, చదువుకునే పిల్లలకు బాగా పని చేశాయి. పల్లెల్లో ఆధార్ కేంద్రాలు ఉంటే పేద ప్రజలకు దూరభారం పాయ్యే తిప్పలు ఉండదు కదా. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని సచివాలయాల్లో ఆధార్ సేవలను పునః ప్రారంభించాలి.
– గొర్ల మద్దిలేటి, వార్డు సభ్యుడు, సి.బెళగల్

చర్యలు తీసుకుంటాం



మండలంలో మూడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని సాంకేతిక కారణాలతో ఈనెల 24వ తేదీ వరకు పనిచేయ లేదు. ముడుమాల సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. పోలకల్, సి.బెళగల్ సచివాలయాల్లో కూడా ఆధార్ కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. – శకుంతల, ఎంపీడీఓ, సి.బెళగల్

క్లుప్తంగా

బనవాసి కేవీకేలో రేపు రైతులకు శిక్షణ

ఎమ్మిగనూరురూరల్: కృషివిజ్ఞాన కేంద్రాల (కేవీకేల) స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు బనవాసి కేవీకేలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కే రాఘవేంద్ర చౌదరి పేర్కొన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ, కంది పంటల సాగు, పశువుల సమస్యలపై శాస్త్రవేత్తలతో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నారు పెంచి ఇస్తాం

రైతులు కూరగాయలు, పూల విత్తనాలు ఇస్తే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలోని షేడ్ నెట్స్‌లో నారు పెంచి ఇస్తామని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కే రాఘవేంద్రచౌదరి తెలిపారు. నారు పెంచి ఇస్తే ఒక్కొక్క మొక్కకు రూ. 40 పైసలు మాత్రమే తీసుకుంటామన్నారు. వివరాలకు 7799022061, 9603293514 నంబర్లకు ఫోన్ చేయవచ్చునని పేర్కొన్నారు.

నడుస్తూ.. కుప్పకూలి మృత్యు ఒడికి

- గుండెపోటుతో యువకుడి మృతి


విష్ణురెడ్డి(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డులో గురువారం విష్ణురెడ్డి(28) అనే యువకుడు నడుచుకుంటూ వెళ్తూ గుండె పోటుతో కుప్పకూలి మృతి చెందాడు. మంత్రాలయం మండలం సూగురు గ్రామానికి చెందిన నాగిరెడ్డి, లక్ష్మీదేవి దంపతులకు హనుమంతరెడ్డి, విష్ణురెడ్డి సంతానం. రెండో కుమారుడు విష్ణురెడ్డి(28) కొంత కాలంగా ఎమ్మిగనూరు పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డులో ఫర్టిలైజర్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. షాప్ సమీపంలో రూమ్‌ను అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఉదయం బయటకు వచ్చి స్టాల్ దగ్గర టీ తాగి రూమ్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా గుండెపోటు రావటంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. రోడ్డున వెళ్తున్న వారు వెంటనే చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు గుర్తించారు. కుమారుడు మృతి చెందిన విషయం సూగూరులోని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. పెళ్లి కాకుండానే కుమారుడు మృతి చెందటంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పాముకాటుకు మహిళ మృతి


మృతి చెందిన లక్ష్మీదేవి

మహానంది: వజ్రాన్వేషణకు వచ్చిన ఓ మహిళ పాము కాటుతో మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. అనంతపురం పట్టణానికి చెందిన పుల్ల లక్ష్మీదేవి (58) తనకు తెలిసిన వారితో కలిసి కొద్దిరోజుల క్రితం నంద్యాల జిల్లా, నల్లమలలోని సర్వనరసింహస్వామి ఆలయం సమీపంలో వజ్రాన్వేషణకు వచ్చింది. ఆమెతో పాటు మరో నలుగురు ఆంజనేయపురంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. బుధవారం వజ్రాన్వేషణ అనంతరం రాత్రి ఇంటికి వచ్చిన లక్ష్మీదేవి బ్యాగులో దుస్తులు సర్దుకునేందుకు చెయ్యి పెట్టింది. అప్పటికే అందులో ఉన్న పాము ఆమెను కాటేసింది. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మృతి చెందిన లక్ష్మీదేవి కుమారుడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.


క్రిష్ణానగర్ నుంచి బయటకు వచ్చే మలుపులో ఇదీ పరిస్థితి

ఈ గుంతలు కనిపించట్లేదా!

గత ప్రభుత్వంలో మారుమూల పల్లెల్లో రోడ్లకు గుంతలు పడినా శివాలెత్తిన టీడీపీ నాయకులు, జిల్లా కేంద్రం కర్నూలులోనే ఇప్పుడు అడుగడుగునా గుంతలు తేలినా మేల్కోని పరిస్థితి. ఉమ్మడి జిల్లా నుంచి రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బీసీ జనార్దన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ఇక్కడి రోడ్లలో మార్పు రాకపోవడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోంది. మరీ ముఖ్యంగా బిర్లాగేట్ సమీపంలో, డీఎంహెచ్‌ఓ కార్యాలయం రహదారిలో.. గాయత్రి ఎస్టేట్.. కేసీకెనాల్ వినాయక గుడి వద్ద.. నంద్యాల చెక్‌పోస్టు.. ఇలా ఎక్కడికక్కడ గుంతలు తేలిన రోడ్డులో వాహనదారులు పడుతూ లేస్తున్నా ప్రశ్నించే నోళ్లు మూతపడటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


బిర్లాగేట్ సమీపంలోని జ్యోతిరావు పూలే సర్కిల్‌లో భారీ గుంతలు


కేసీ కెనాల్ వినాయక గుడి సమీపంలో పాడైన రహదారి


నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో..


నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లో ఏర్పడిన గొయ్యి


గుంతలమయంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వెళ్లే రహదారి

ప్రాణం తీసిన గుంతలు

- ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి


మృతిచెందిన కల్లు శ్రీరాములు


ప్రమాదానికి కారణమైన గుంతలు

దేవనకొండ: రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం కరివేముల, తెర్నేకల్ మధ్య చోటుచేసుకుంది. తెర్నేకల్ గ్రామానికి చెందిన కల్లు శ్రీరాములు(42) తన సొంత ఆటోను నడుపుకుంటూ వెళ్తుండగా కరివేముల–తెర్నేకల్ మధ్యలో కురువ దాసప్ప పొలం వద్ద రోడ్డుపై గుంతలు కనిపించాయి. వాటిని తప్పించబోయి ఆటోను పక్కకు తిప్పాడు. దీంతో ఒక్కసారిగా ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న పత్తి పొలంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రామంజినమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

నిత్యం ప్రమాదాలే....

దేవనకొండ, పత్తికొండ మండలాల ప్రజలు ఎమ్మిగనూరుకు కరివేముల నుంచి తెర్నేకల్ మీదుగా వెళ్తారు. ఈ రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గుంతలు ఉన్నాయి. నిత్యం ఏదో ఒక రకంగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొని ఇద్దరు మృతి

- బ్రాహ్మణకొట్కూరు–గార్గేయపురం మధ్య ఘటన
- శోకసంద్రంలో శాతనకోట గ్రామం


మృతి చెందిన ఈరన్న, హరికృష్ణ, (ఫైల్)

నందికొట్కూరు: ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు–గార్గేయపురం గ్రామాల మధ్య గురువారం జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం... శాతనకోట గ్రామానికి చెందిన తెలుగు లలితమ్మ, వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడు ఈరన్న(28) శాతనకోట గ్రామం నుంచి కర్నూలుకు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన హైమావతితో ఐదు నెలల కిందటే వివాహమైంది. భార్య గర్భం దాల్చడంతో కర్నూలు పట్టణంలోని వైద్యుల వద్ద చూపించి భార్య, అత్త అనితమ్మను బస్సులో గ్రామానికి పంపించాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన బోయ లక్ష్మీదేవి, లక్ష్మన్న దంపతుల కుమారుడు హరికృష్ణ(26)తో కలిసి కర్నూలు నుంచి గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌ఐ నాగార్జున ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతులు ఇద్దరూ ఆయా కుటుంబాలకు ఒక్కరే వారసులు కావడంతో తల్లిదండ్రుల రోదన మిన్నంటింది.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పాణ్యం: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ మంజులవాణి అన్నారు. గురువారం పాణ్యంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు తమ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. ప్రస్తుతం వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలన్నారు. మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించాలన్నారు. చెత్త సేకరణకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం పాణ్యం సీహెచ్‌సీ ఆవరణాన్ని పరిశీలించి డాక్టర్ రోహేలాతో మాట్లాడారు.

అమ్మ పేరిట మొక్క.. పుడమితల్లికి రక్ష

- ఆర్‌యూ పరిధిలో 56 యూనిట్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటనున్న వలంటీర్లు


ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కర్నూలు కల్చరల్: భూమాతకు రక్షణగా ఉండేందుకు.. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన తరుణం ఆసన్నమైంది. పెరిగిపోతున్న కాలుష్యాన్ని.. అంతరించిపోతున్న సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి (ఏక్ పేడ్ మా కే నామ్) అని దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. తద్వారా వన మహోత్సవానికి ఊతమివ్వాలని కోరారు. అమ్మకు గుర్తుగా ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి పరిరక్షించాలి. అన్ని విద్యా సంస్థల్లో విద్యార్థుల చేత మొక్కలు నాటించాలి. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వలంటీర్లు దీన్ని తమ బాధ్యతగా స్వీకరించి మొక్కలు నాటడంతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉంది. వన సంపద పెంచుకుంటే స్వచ్ఛమైన ఆక్సిజన్ పొందటంతో పాటు వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కవచ్చు. దీన్ని యజ్ఞంలా భావించి రాయలసీమ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 56 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉన్నాయి. వీటిల్లో 5600 మంది వలంటీర్లు ఉన్నారు. ఇప్పటికే వర్సిటీ క్యాంపస్‌లోని నాలుగు యూనిట్లతో పాటు వర్సిటీ పరిధిలోని 52 యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు భాగస్వాములై ఈ కార్యక్రమానికి బాగా ప్రచారం కల్పించి మొక్కల పెంపకంలో పాల్గొనేలా చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్‌యూ పరిధిలో వలంటీర్ల వివరాలు..

యాజమాన్యం	జూనియర్ కళాశాలలు	డిగ్రీ కళాశాలలు	వలంటీర్లు మొత్తం
ప్రభుత్వ	15	14	2,900
ప్రైవేట్	6	12	1,800
ఎయిడెడ్	-	5	500
ఆర్‌యూ క్యాంపస్	-	4	400
మొత్తం	21	35	5,600

నష్టాన్ని నివారించాలి



నగరీకరణ, పారిశ్రామికీకరణలతో ప్రకృతికి ఎంతో నష్టం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేసి పర్యావరణాన్ని కాపాడుకోవాలి. పర్యావరణ సమతుల్యతను రక్షించుకోడంలో చెట్లపాత్ర ఎంతో ఉంటుంది. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి. వాటి సంరక్షణను చేపట్టాలి. యువతను ఆ దిశగా ప్రోత్సహించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పించడం సంతోషించదగిన విషయం. ఆర్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీరుగా నేను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామిని కావడం ఆనందంగా ఉంది.

– వై. హేమలత, బీటెక్ ద్వితీయ సంవత్సరం, ఆర్‌యూసీఈ

సహజ సంపదను కాపాడుకోవాలి



మానవజాతి మనుగడకు చెట్లే ఆధారం. రకరకాల కారణాలతో మన చుట్టు పక్కల కూడా పచ్చదనం కరువవుతోంది. స్వచ్ఛమైన గాలి మాత్రమే కాదు తగినంత వర్షపాతం కురవాలన్నా వన సంపద తప్పనిసరి. కాబట్టి తల్లి పేరు మీదుగా ఓ మొక్క నాటడమన్న కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేయడం చాలా మంచి పరిణామం. ఖాళీ స్థలాల్లో తగినన్ని మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్తుకు మంచి వాతావరణాన్ని అందించిన వారమవుతాం.

– కొండారెడ్డి ధాత్రి, బీటెక్ ద్వితీయ సంవత్సరం, ఆర్‌యూసీఈ

రెండు వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు



అమ్మ పేరిట మొక్క కార్యక్రమంలో భాగంగా ఆర్‌యూలో ఒకే రోజు సుమారు రెండు వేల మొక్కలు నాటేందుకు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించారు. మొక్కల కోసం వర్సిటీ కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో డ్వామా అధికారుల ద్వారా జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పెట్టారు. మొక్కలు వచ్చిన వెంటనే రెండు మూడు రోజుల్లో నాటేందుకు శ్రీకారం చుడతాం. వర్సిటీ పరిధిలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో కచ్చితంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటించాలి.

– ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్, రాయలసీమ యూనివర్సిటీ

28న బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నందమూరినగర్‌లోని రాయల్ హోమ్స్ సమీపంలో ఈనెల 28న పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా, నంద్యాల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏపీరెడ్డి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆగస్టు 2, 3, 4 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు సుబ్రమణ్యం, సుధాకర్, దండె నాగరాజు, సురేష్‌నాయుడు, ఓబులేసు, నాగరాజు, రామేశ్వరరెడ్డి, భరత్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు. మరింత సమాచారం కోసం 9849548926ను సంప్రదించాలన్నారు.

ఫీజు వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలు లక్ష్యం మేరకు ఫీజు వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు సెక్రటరీలను ఆదేశించారు. గురువారం ఆయన కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మార్కెట్ కమిటీల సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీలు ఫీజు వసూలులో జూన్ వరకున్న లక్ష్యాలను అధిగమించడం అభినందనీయమన్నారు. కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు మార్కెట్ కమిటీలు వెనుకబడ్డాయన్నారు. కర్నూలు జిల్లాలో 2024–25లో రూ.34.14 కోట్ల ఫీజు వసూలు లక్ష్యం కాగా జూన్ వరకు రూ.6.28 కోట్లు వసూలు చేశారని తెలిపారు.

- నంద్యాల జిల్లాలో ఎనిమిది మార్కెట్ కమిటీలు ఉండగా ఫీజు లక్ష్యం రూ.25 కోట్లు ఉందన్నారు. అయితే జూన్ వరకు 10.50 శాతం మాత్రమే సాధించారన్నారు. అన్ని మార్కెట్ కమిటీలు ఫీజు వసూలులో వెనుకబడ్డాయని తెలిపారు. మార్కెట్ కమిటీల ఆదాయం పక్కదారి పట్టకుండా ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మార్కెట్ కమిటీల్లోని గోదాములు, షాపుల బాడుగల వసూలుకు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏడీలు నారాయణమూర్తి, అబ్దుల్ రహిమాన్, కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు (సెంట్రల్): కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌లోని తుంగభద్ర డ్యామ్‌లోకి 1,50,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, డ్యామ్ నుంచి దిగువకు లక్ష క్యూసెక్కుల నీరు వదలుతున్నారని, నదీ తీరంలో ఉండే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు కూడా ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసి వారు జాగ్రత్తగా ఉండేలా అప్రమత్తం చేయాలని సూచించారు. నదీ తీర ప్రాంతంలో ఉండే అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

31న మిగిలిపోయిన సీట్ల భర్తీ

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బయో మెడికల్ ఇంజినీరింగ్, అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో సీట్లు మిగిలిపోయాయని, పాలిసెట్–2024లో అర్హత పొందిన వారు ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఎం వి.ఎస్.ఎస్.ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా అడ్మిషన్ పొందని వారు ఈ నెల 29వ తేదీలోపు స్పాట్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్హత, వివిధ ధ్రువీకరణ పత్రాలతో పాటు, పాలిసెట్ ర్యాంకు కార్డు రెండు సెట్ల జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఈనెల 31వ తేదీన నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్‌లో రూ.6 వేలు ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9989899095 నంబరును సంప్రదించాలన్నారు.

బాలల హక్కులపై అవగాహన పెరగాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ జే రాజేంద్రప్రసాద్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిషన్ సభ్యులు, సంక్షేమ శాఖల అధికారులు

కర్నూలు (అర్బన్): బాలల హక్కులపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ జే రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రిన్సిపాళ్లు, అన్ని సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహ సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ పి.వెంకటలక్షుమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మి దేవి, మైనార్టీ సంక్షేమాధికారి సునీల్ కన్నా, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాల లోపు చిన్నారులు, విద్యార్థులకు విద్య, వైద్య సదుపాయాలతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలకు నిధులు మంజూరు చేసి సహకారం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణకు కమిషన్ పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా వసతి గృహాల్లో ఉన్న అధికారులు, సిబ్బంది బాలలతో స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. వారి విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత పట్ల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ సమితి ఏర్పాటైన నేపథ్యంలో తొలిసారి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీల నేతృత్వంలో విస్తృతంగా బాలల హక్కుల పరిరక్షణకు పలు కార్యక్రమాలను చేపడతామన్నారు. బాలలకు జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపు హక్కు, రక్షణ పొందే హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే 2006 ప్రకారం బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జీవో ఎంఎస్ నెం.39 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా బాల్య వివాహాల నిరోధక అధికారులను అదనంగా నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం – 2006కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద, సహాయ సంక్షేమాధికారులు కె.బాబు, బి.మద్దిలేటి పాల్గొన్నారు.

మహిళపై టీడీపీ నాయకుల దాడికి యత్నం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాలలో టీడీపీ నాయకులు మహిళపై దాడికి యత్నించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డికి చెందిన భూమిలో గురువారం టీడీపీ నాయకులు జేసీబీతో గుంతలు తీస్తుండటంతో అతని భార్య విజయలక్ష్మితో పాటు అన్న కుమారుడు చక్రపాణిరెడ్డి పొలం వద్దకు వెళ్లారు. గుంతలు ఎందుకు తీస్తున్నారని కోరడంతో ఆమెపై టీడీపీ నాయకులు మునగాల పెద్ద రామసుబ్బారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు దాడికి ప్రయత్నించడంతో ఆమె చేతి గాజులు పగిలిపోయాయి. ఇద్దరి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను లాగేసుకున్నారు. ఈ విషయంపై బాధితురాలు భర్త శ్రీకాంత్‌రెడ్డితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదు. ఎన్నికల ఫలితాల వెలువడగానే భూ సమస్యను అడ్డుపెట్టుకొని టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డిపై ఇతర ప్రాంతాలకు చెందిన బంధువులను పిలిపించి దాడి చేయించారు.